‘భరోసా’నిచ్చే సాయం

నేడు మూడో విడత వైఎస్సార్ రైతు భరోసాకు శ్రీకారం

- సాగును సంబరం చేస్తున్న ప్రభుత్వం
- కృష్ణాజిల్లాలో 1,51,505 మందికి రూ.32.93 కోట్లు
- ఎన్టీఆర్ జిల్లాలో 1,34,338 మందికి రూ.29.33 కోట్లు



పొలం పనులు చేస్తున్న రైతులు(ఫైల్)

కంకిపాడు(పెనమలూరు): అన్నదాతకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సాగును సంబరంగా మార్చేందుకు కృషి చేస్తోంది. ఇచ్చిన హామీకి అనుగుణంగా.. సన్న, చిన్నకారు రైతులకు, కౌలురైతులకు సాయం అందించేందుకు, సాగులో చేయూత అందించేందుకు వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకాన్ని అమలు చేస్తోంది. ఒక్కో రైతుకు రూ. 13,500 విడతల వారీగా రైతుల ఖాతాలకు జమ చేసేందుకు చర్యలు తీసుకుంది. ఏటా క్రమం తప్పకుండా సమయానికి నగదు అందిస్తోంది. ఇదే క్రమంలో వరుసగా నాలుగో ఏడాది మూడో విడత సాయంగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో రూ.62.26 కోట్లను రైతులకు అందించనుంది.

కృష్ణాజిల్లాలో..

ఇచ్చిన హామీకి అనుగుణంగా సాగును సంబంరంగా మార్చేందుకు ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. కృష్ణా జిల్లాలో 2019–20లో 1,44,234 మందికి రూ 111.98 కోట్లు, 2020–21లో 150487 మందికి రూ 116.97 కోట్లు, 2021–22లో 1,43,707 మందికి రూ 111.40 కోట్లు, 2022–23లో మొదటి విడతలో 1,40,165 మందికి రూ 77.09కోట్లు, రెండో విడతగా 150213 మందికి రూ 67.98 కోట్లు అందించారు. మూడో విడతగా 2022–23 సంవత్సరానికి సంబంధించి మూడో విడతగా 1,51,505 మందికి రూ 32.93 కోట్లు రైతులకు విడుదల చేసేందుకు సన్నాహాలు చేశారు.

ఎన్టీఆర్ జిల్లాలో..

ఎన్టీఆర్ జిల్లాలోని 17 మండలాల్లో రైతుభరోసా కింద తొలి విడతగా 1,21,711 మందికి రూ. 66.94 కోట్లు విడుదలైంది. రెండో విడతగా 1,31,084 మంది రైతులకు రూ. 59.82కోట్లు అందాయి. మూడో విడతగా 1,34,338 మంది రైతులకు రూ. 29.33 కోట్లు రైతులకు అందనున్నాయి.

టీడీపీ సర్కారు నిర్లక్ష్యం..

రైతులను, వ్యవసాయ రంగాన్ని టీడీపీ సర్కారు పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. భరోసా లేక రైతులు వ్యవసాయానికి దూరమయ్యే పరిస్థితి దాపురించింది. ఈ పరిస్థితుల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రలో రైతులకు భరోసా కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీకి అనుగుణంగా వరుసగా నాలుగో ఏడాది కూడా రైతుభరోసా వర్తింపజేస్తూ సాగుకు ఊతంగా ప్రభుత్వం నిలుస్తోంది.

పండుగలా మారింది..



గత ప్రభుత్వంలో వ్యవసాయానికి ఎలాంటి చేదోడు లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెట్టుబడి సాయంగా రూ. 13,500 అందుతోంది. రైతుభరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు సమకూరుతున్నాయి. పంట చేతికి అందాక కొనుగోళ్లు చేపడుతున్నారు. మద్దతు ధర అందుతుంది. వ్యవసాయం పండుగలా మారింది అనటంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

– ముసిబోయిన వెంకటేశ్వరరావు, రైతు, పునాదిపాడు

అర్హులందరికీ పథకాలు..



ప్రభుత్వం వ్యవసాయానికి తోడ్పాటునందిస్తూ అనేక పథకాలను అమలు చేస్తోంది. రైతుభరోసా పథకం రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. అర్హుందరికీ పథకం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. సాంకేతిక, ఇతర కారణాలతో పథకం అందకున్నా, సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించి పథకాన్ని వర్తింపజేస్తున్నాం. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సమర్థంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– మనోహరరావు, జిల్లా వ్యవసాయాధికారి, కృష్ణాజిల్లా

మత్తు పదార్థాలతో అనర్థాలు

కలెక్టర్ ఢిల్లీరావు



కళాశాల విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను వివరించి, విష సంస్కృతికి దూరంగా ఉండేలా విద్యార్థుల్లో చైతన్యం పెంచాలని కలెక్టర్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. ఇటీవల విభిన్న ప్రతిభావంతులకు నిర్వహించిన ఆటల పోటీల్లో సేవలందించిన కానూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు సోమవారం కలెక్టర్ ఢిల్లీరావు ఆయన కార్యాలయంలో ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాంకేతిక విజ్ఞానాన్ని కొందరు విద్యార్థులు చెడు వ్యసనాలకు ఉపయోగిస్తూ భవిష్యత్‌ను పాడుచేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్, విద్య, వైద్య ఆరోగ్య, మహిళాభివృద్ధి, సాంఘిక సంక్షేమం తదితర శాఖల అధికారుల సమన్వయంతో జిల్లాలోని కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించి మత్తుపదార్థాల వినియోగాన్ని అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఔత్సాహికులైన విద్యార్థులు టీంలుగా ఏర్పడి విద్యార్థుల ముఖ కవళికలు, ఆరోగ్యపరమైన మార్పులను గమనించి వారి ప్రవర్తనలో మార్పు తీసుకువస్తే నిజమైన సేహ్నితులుగా మిగిలిపోతారన్నారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలు పంపిణీలో విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు రామకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య చికిత్సకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

గన్నవరం: అనారోగ్యంతో బాధపడుతున్న సూరంపల్లికి చెందిన తాడిగడప రవిబాబు వైద్య చికిత్సలకు ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ రూ.25 వేలు ఆర్థిక సాయం చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ నేతలు సోమవారం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రవిబాబును పరామర్శించి అతని కుటుంబానికి నగదును అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి మాట్లాడుతూ మెదడకు సంబంధించిన అనారోగ్య సమస్యతో చికిత్స పొందుతున్న రవిబాబు గురించి తెలియగానే ఎమ్మెల్యే వెంటనే స్పందించారని చెప్పారు. అతని వైద్య అవసరాల నిమిత్తం తక్షణ సాయం చేయడంతో పాటు మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వైద్యులకు సూచించినట్లు తెలిపారు. మాజీ సర్పంచి నీలం ప్రవీణ్‌కుమార్, పార్టీ మండల కన్వీనర్ కైలే శివకుమార్, పార్టీ నేతలు నిడమర్తి నాగేశ్వరరావు, గొన్నూరు సీమయ్య, కలపాల అబ్రహాం, చోడవరపు వెంకటేశ్వరరావు, జువ్వనపూడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై చెరకు ట్రాక్టర్ బోల్తా

కంకిపాడు: జాతీయ రహదారిపై చెరకు ట్రాక్టర్ బోల్తా కొట్టిన సంఘటన గోసాల–కంకిపాడు మార్గంమధ్యలో సోమవారం జరిగింది. వివరాలిలా వున్నాయి. ఈడుపుగల్లు పరిధిలోని వ్యవసాయ క్షేత్రాల నుంచి చెరకు లోడుతో విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపైకి నాలుగు ట్రాక్టర్లు చేరుకుని ఉయ్యూరు చక్కెర కర్మాగారానికి వెళ్తుండగా గోపాల–కంకిపాడు మార్గంమధ్యలో ఒక ట్రాక్టర్ ఒక్కసారిగా ఒరిగి పల్టీ కొట్టింది. ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్ సునీల్‌తో పాటు కూలీలు అప్రమత్తమై పక్కకు దూకివేశారు. దీంతో ఎవరికీ ప్రాణాపాయం జరగలేదు. చెరకు లోడు జాతీయ రహదారిపై పడిపోవడంతో విజయవాడ–కంకిపాడు మార్గంలో వాహనాల రాకపోకలకు అసౌకర్యం ఏర్పడింది.

పాస్ పుస్తకాల్లో నమోదు కోరుతూ దరఖాస్తులు



స్పందనలో దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్ జాహ్నవి

విజయవాడరూరల్: పట్టాదారు పాస్ పుస్తకాల్లో కొత్త సర్వే నంబర్లను నమోదు చేయాలని కోరుతూ స్పందనలో మూడు దరఖాస్తులు వచ్చాయి. విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. నున్న గ్రామానికి చెందిన ఆర్ఎస్ నంబర్లు 1/3ఎలో 96 సెంట్లు భూమి, ఎకరం ఒక సెంటు, 5/1 లో 30 సెంట్లు భూమిని పాస్ పుస్తకంలో నమోదు చేయాలని నరెడ్ల నర్సిరెడ్డి, నరెడ్ల హేమన కుమారి దరఖాస్తులను అందజేశారు. పాతపాడు గ్రామంలో ఆక్రమణలో వున్న భూమికి సర్వే చేయాలని కోరుతూ అవుతు భాస్కరరెడ్డి, అవుతు సత్యవతి దరఖాస్తు చేసుకున్నారు. కొత్తూరు తాడేపల్లి గ్రామంలో తన పొలం ఆక్రమించుకునే ప్రయత్నం జరుగుతోందని, కొలతలు కొలవాలని దొప్పల మైసమ్మ స్పందనలో దరఖాస్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.భార్గవి, ఏఈ శివరామకృష్ణ, డీటీ విజయకుమార్, హౌసింగ్ డీఈ నాగమల్లేశ్వరావు పాల్గొన్నారు.

కళాకారులు సాంస్కృతిక రాయబారులు

విజయవాడ కల్చరల్: కళాకారులు సాంస్కృతిక రాయబారులని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సమతా సేవా సమతి 12వ వార్షిక వేడుకల సందర్భంగా సోమవారం దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో వివిధ రంగాల ప్రముఖులకు ఆత్మీయ సత్కారం జరిగింది. రంగస్థల నటుడు, దర్శకుడు ప్రయోక్త డాక్టర్ పీవీఎస్ కృష్ణకు గండపెండేర బహూకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కళలు దేశ సాంస్కృతిక వైభవాన్ని చాటుతాయన్నారు. మాజీ డెప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్, సంస్థ నిర్వాహకుడు చింతా వెంకటేశ్వర్లు ప్రసంగించారు. అనంతరం దుర్యోధనుని ఏకపాత్రాభినయం, పాండవ ఉద్యోగ పర్వంలోని పడక సీను ఘట్టాన్ని ప్రదర్శించారు.

క్లుప్తంగా

పెదపులిపాక పాఠశాలలో టీచర్‌పై ఫిర్యాదు

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న టీచర్‌పై చర్య తీసుకుని విద్యార్థులకు న్యాయం చేయాలని వైఎస్సార్ సీపీ నేత, గ్రామ సర్పంచి గుంటూరు శ్రీనివాస చౌదరి అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం మండల విద్యాశాఖ అధికారికి రాతపూర్వరంగా ఫిర్యాదు చేసి వివరాలు తెలిపారు. దళితవాడలో చదువుతున్న విద్యార్థులు చదువులో వెనుకబడటం వలన టీచర్ ఇబ్బందికి గురి చేస్తున్నారని, ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్ సైతం తీసుకున్నారని, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

ఇంటి పన్నులు సక్రమంగా వసూలు చేయాలి

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో ఉన్న రెవెన్యూ లోపాలు సరి చేసి ఇంటి పన్నులు సక్రమంగా వసూలు చేయాలని మున్సిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావు అన్నారు. ఆయన సోమవారం తన కార్యాలయంలో ఆర్ఐ, వార్డు సచివాలయం కార్యదర్శులు, మున్సిపాలిటీ సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి పన్నులు ఇప్పటివరకు కేవలం 65 శాతం మాత్రమే వసూలయ్యాయన్నారు. గతంలో ఇంటి పన్నులు వేయటంలో అనేక లోపాలు జరిగాయన్నారు. ఆయా సెక్టార్ల ఆర్ఐలు ప్రత్యేక దృష్టి సారించి గతంలో తలెత్తిన లోపాలు సరిచేయాలని ఆదేశించారు. మార్చి నాటికి ఇంటి పన్నుల వసూళ్లు పూర్తి చేయాలని, 2023–2024 వ సంవత్సరానికి డిమాండ్లు ఎటువంటి లోపాలు లేకుండా గృహ యజమానులకు ఇవ్వాలన్నారు. పన్నుల విషయంలో ప్రజలను అసౌకర్యానికి గురి చేయరాదని కమిషనర్ ప్రకాశరావు తెలిపారు.

రూ.68.99 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ



పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం 305 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. నార్త్‌సౌత్ ఫౌండేషన్(ఎన్ఎస్ఎఫ్) సహకారంతో చదువులో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.68.99 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, పుట్టగుంట సతీష్‌కుమార్, డీన్ బావినేని పాండురంగారావు, ఎన్ఎస్ఎఫ్ ప్రతినిధి ప్రసాద్, కన్వీనర్ చాగర్లమూడి బేబీరాణి, సూరపనేని వెంకటరత్నం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తాత, మనవడికి గాయాలు

పెనమలూరు: కానూరు వందడుగుల రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తాత, మనవడికి గాయాలయ్యాయి. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడకు చెందిన కె.హేమంత్‌సాయి తన తాత దొండపాటి శ్రీనివాసరావును బైక్‌పై ఎక్కించుకుని కానూరు వందడుగుల రోడ్డులో వెళుతుండగా ఎదురుగా వచ్చిన కారు మలుపు తిరుగుతూ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ పై ఉన్న ఇద్దరికీ గాయాలవటంతో స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సకు చేర్చారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

యనమలకుదురు ఆలయంలో ప్రత్యేక పూజలు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి ఉదయం అభిషేకం, అనంతరం స్వామివార్లకు విశేష అలంకరణ చేశారు. శ్రీపార్వతీదేవి అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. భక్తులు స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

క్షయవ్యాధిపై విద్యార్థులకు అవగాహన

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు క్షయ వ్యాధి నివారణ, నిర్మూలనపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ క్షయ నిర్మూలన ప్రోగ్రాం క్రింద రే ఆఫ్ హోప్ సర్వీస్ సొసైటీ, బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డాక్టర్ నారయ్య మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు, వ్యాధి తీవ్రత నిర్ధారణ పరీక్షలను గూర్చి వివరించారు. క్షయ వ్యాధి సోకిన వారికి ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సేవలను ఆయన విద్యార్థులకు తెలియజేశారు. రే ఆఫ్ హోప్ సర్వీస్ సొసైటీ ప్రతినిధి టి.మురళి మాట్లాడుతూ ప్రపంచంలోని క్షయవ్యాధిగ్రస్తుల్లో దాదాపు 20 శాతం మంది భారత్‌లోనే ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశం నుంచి క్షయ వ్యాధిని 2025 నాటికి సమూలంగా నిర్మూలించేందుకు ప్రభుత్వం ప్రణాళిక చేపట్టిందని చెప్పారు. గన్నవరం టీబీ యూనిట్ అధికారి రఘు, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ప్రమీలారాణి పాల్గొన్నారు.

పెనమలూరు డిజిటల్ అసిస్టెంట్‌కు సత్కారం



ఉత్తమ సేవలు అందించిన డిజిటల్ అసిస్టెంట్ కిషోర్‌బాబును సన్మానిస్తున్న అధికారులు

పెనమలూరు: ఉత్తమ సేవలు అందించిన పెనమలూరు 1 సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ మట్టా కిషోర్‌బాబుకు జిల్లా స్థాయిలో ప్రశంసా పత్రం అందజేశారు. పెనమలూరు మండలంలో ఆధార్ మార్పులు, చేర్పులు, ఇతర సేవలు అందించిన మట్టా కిషోర్‌బాబు సేవలను గుర్తించి కృష్ణాజిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా మచిలీపట్నంలో సోమవారం ప్రశంసాపత్రం అందజేశారు. జిలాల్లో ఐదుగురు ఉత్తమ సేవలు అందించగా పెనమలూరు మండలం నుంచి కిషోర్‌బాబు ఎంపిక య్యారు. ఈ సందర్భంగా పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సునితాశర్మ, తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, మండల పరిషత్ సిబ్బంది కిషోర్‌బాబును సన్మానించారు.

పూరిల్లు దగ్ధం : రూ.2 లక్షలు ఆస్తి నష్టం



ప్రమాదంలో దగ్ధమైన ఇల్లు

కంకిపాడు: అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని కోలవెన్నులో ఆదివారం అర్ధరాత్రి తరువాత చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం...కోలవెన్ను గ్రామానికి చెందిన పిన్నింటి రాములు కుటుంబం తాటాకు ఇంట్లో నివాసం ఉంటోంది. ఆదివారం అర్ధరాత్రి దాటాక విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి ఇంటికి నిప్పంటుకుంది. ప్రమాదాన్ని గుర్తించే లోపే మంటలు ఇంటిని చుట్టుముట్టాయి. రాములు కుటుంబ సభ్యులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. ప్రమాదంలో ఇంట్లో ఉన్న సామగ్రి మొత్తం అగ్నికి ఆహుతైంది. రూ.2 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లింది. బాధిత కుటుంబాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు సోమవారం పరామర్శించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ బాలాజీ బాధిత కుటుంబాన్ని పరామర్శించి వంట సామగ్రి, గృహోపకరణాలు అందించారు. ప్రభుత్వం నుంచి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ టీవీ సతీష్, సర్పంచ్ చోరగుడి సురేష్ కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు తోకల ఉమాదేవి, స్థానిక ప్రతినిధులు కంచర్ల శేషగిరి, కొలుసు లక్ష్మణ్, కె.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అద్దె ట్రాక్టర్లను కొనసాగించేందుకు నిరాకరణ

గన్నవరం: స్థానిక గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణకు గాను అద్దె ట్రాక్టర్లను కొనసాగించేందుకు వీలు లేదని పాలకవర్గ సభ్యులు తేల్చిచెప్పారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచి నిడమర్తి సౌజన్య అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు అద్దె ట్రాక్టర్ల టెండర్ కాలపరిమితి మార్చి 31తో ముగుస్తుండడంతో కొనసాగింపుపై తీర్మానం పెట్టారు. దీనిని పాలకవర్గ సభ్యులు వ్యతిరేకించారు. పంచాయతీకి పెనుభారంగా మారిన రెండు అద్దె ట్రాక్టర్లను గడువు తర్వాత తీసివేయాలని నిర్ణయించారు. పంచాయతీకి డంపింగ్ యార్డు లేని కారణంగా సేకరించిన చెత్తను గుంటూరులోని జిందాల్ విద్యుత్ ఉత్పత్తి కంపెనీకి తరలించాలని పాలకవర్గం అంగీకరించింది. తూములు, సిమెంట్ బల్లల కొనుగోలు బిల్లులు చెల్లించేందుకు పెట్టిన తీర్మానాన్ని సభ్యులు తిరస్కరించారు. వేసవి కాలంలో ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం కొత్త బోర్లు ఏర్పాటు చేసేందుకు, మోటర్లు కొనుగోలుకు తీర్మానాలు చేశారు. ఉపసర్పంచ్ పొలదుగు నాని, పలువురు ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధి పనులు వేగవంతం



ఇందుపల్లిలో చేపడుతున్న రోడ్డు అభివృద్ధి పనులు

ఉంగుటూరు: ఇందుపల్లి–చాగంటిపాడు రహదారి నుంచి జగనన్న కాలనీకి వేళ్ల అప్రోచ్‌రోడ్డు నిర్మాణం పనులు సోమవారం ప్రారంభించారు. మండల పరిషత్ సాధారణ నిధులు రూ.7 లక్షలతో రహదారి పనులు చేపట్టారు. రహదారికి ఇరువైపులా ఉన్న జంగిల్‌ను పొక్లెయిన్‌తో క్లియర్ చేశారు. ఎంపీడీవో శేషగిరిరావు అభివృద్ధి పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. రహదారి అభివృద్ధి చేయడం వలన గృహనిర్మాణాలు వేగవంతం చేసేందుకు అనుకూలంగా ఉంటుందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు తేలప్రోలులో గృహసారథులు సమావేశం

ఉంగుటూరు: తేలప్రోలులో రంగమ్మ పేరంటాలు కల్యాణమండపంలో మండలంలోని వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశం మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాల్లోని 320 మంది వలంటీర్లు, 48 మంది సచివాలయ కన్వీనర్లు, 640 మంది గృహసారథులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

టీచర్స్ కాలనీలో బోరు ఏర్పాటు

నున్న(విజయవాడరూరల్): మండల పరిషత్ గ్రాంటు నుంచి మంజూరైన మూడు లక్షల రూపాయలతో సోమవారం టీచర్స్ కాలనీలో ట్యాంక్ వద్ద బోరు నిర్మాణం పనులకు గ్రామ సర్పంచి కాటూరి సరళ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, సొసైటీ చైర్మన్ పోలారెడ్డి చంద్రారెడ్డి, డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ భూమి వేలం వాయిదా

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంకు చెందిన ఆలయ భూమికి సోమవారం బహిరంగ వేలంపాట నిర్వహించగా పాటదారులు ఎవరూ హాజరుకాకపోవడంతో వేలం వాయిదా పడింది. గ్రామంలోని ఆర్ఎస్ నంబరు 186లోని దక్షిణం వైపు న్యూ ఆటోనగర్ రోడ్డును ఆనుకుని ఉన్న సుమారు 1936 చదరపు గజాల్లో 5 బిట్లుగా ఉన్న స్థలాన్ని వేలం వేసేందుకు దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎంవీ సురేష్‌బాబు, ఉప కమిషనర్ ఎం. విజయ రాజు, సహాయ కమిషనర్ అన్నపూర్ణ, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ కలెక్టర్ భారతి, డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్ హాజరయ్యారు. ధరావత్తు దారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో వేలాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ పి.లోకేశ్వరి మాట్లాడుతూ 11 ఏళ్ల కాలపరిమితికి వేలంపాట నిర్వహించినా ముందుకు రాకపోవడంతో త్వరలో మరల సీల్డ్ టెండర్–బహిరంగ వేలంపాట నిర్వహిస్తామని తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. స్థానిక ఏలూరురోడ్డులోని గణపతి కాంప్లెక్స్‌లో సోమవారం నిర్వహించిన ఈ పోటీలకు హనుమాన్‌జంక్షన్ పరిసర ప్రాంత హైస్కూళ్లకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. విశ్రాంత ఎంఈవో ఘంటా సత్యనారాయణ పర్యవేక్షణలో ‘అంతర్జాలంలో అన్వేషణ’ అనే అంశంపై వ్యాస రచన పోటీలు జరిగాయి. మానవత జిల్లా అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు చక్కా సుబ్బారావు, బెజవాడ శ్రీరామ్మూర్తి, సీనియర్ సభ్యులు దయాల ప్రభాకరరావు, పొట్లూరి శేషాచలం, క్లోపల్లి నారాయణరావు, వడ్డి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులకు కేడీసీసీ బ్యాంకు అండ



ఆర్థిక సహకారం కింద రూ.10 వేల నగదు అందజేస్తున్న చైర్‌పర్సన్ పాములు

గన్నవరం రూరల్: రైతులకు కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు అండగా నిలుస్తుందని గోపవరపుగూడెం పీఏసీఎస్ చైర్ పర్సన్ కొలుసు పాములు చెప్పారు. స్థానిక పీఏసీఎస్‌లో రుణం పొంది మరణించిన పసుపులేటి రామారావు కుటుంబానికి సోమవారం మట్టి ఖర్చుల కింద రూ.10వేలు నగదు ఆయన అందజేశారు. కేడీసీసీ బ్యాంకు రైతాంగానికి అండగా ఉంటూ బహుముఖంగా సేవలందిస్తుందని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ పర్సన్‌లు చిట్టినేని కోటేశ్వరరావు, కాట్రు కవిత, సీఈవో జొన్నలగడ్డ శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనంపై రాజకీయ పార్టీ హోర్డింగ్

పెనమలూరు: యనమలకుదురులో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భవనంపై టీడీపీ హోర్డింగ్ ఏర్పాటు చేశారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో యనమలకుదురు 1వ నంబర్ సచివాలయం పక్కన ఉన్న మున్సిపాలిటీకి చెందిన భవనంపై లోకేష్ యువగళం హోర్డింగ్‌ను పెట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌పై స్థానికులు మున్సిపాలిటీ అధికారులు ఫిర్యాదు చేసినా నేటికీ చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



లక్ష్యాలకు అనుగుణంగా ఆరోగ్య ప్రగతి

డీఎంహెచ్ఓ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలు లక్ష్యాలకు అనుగుణంగా ప్రగతి సాధించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె నగరంలోని తన కార్యాలయంలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పునరుత్పత్తి శిశు ఆరోగ్యం అప్‌డేట్స్, అభివృద్ధి కమిటీ నిధులు వినియోగంపై మార్గదర్శకాలు, ఫేషియల్ రికగ్నేషన్ సిస్టమ్ అమలు వంటి అంశాలపై సమీక్షించారు. నాన్ కమ్యూనికల్ వ్యాధులు, సాంక్రమిక వ్యాధులు, ఆరోగ్యశ్రీ లబ్ధిదారులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత ఫీడ్ బ్యాక్ సమరీ కార్యక్రమం అమలు, వంటి విషయాలను విశ్లేషించి లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నరసింహనాయక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నళినీదేవి, డీపీఎంఓ డాక్టర్ నవీన్, స్టాటిస్టికల్ అధికారి లక్ష్మోజీ, తదితరులు పాల్గొన్నారు.